
సాక్షి
ఒడిశా
శుక్రవారం । 24 । నవంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,77,142లు, బంగారం 150 మిల్లీగ్రాములు, వెండి 90 గ్రాములు 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రెండో రోజూ గందరగోళం

గిరిజనుల భూములను బదలాయించవచ్చని రాష్ట్ర ప్రభుత్వ వివాదాస్పద నిర్ణయాన్ని విపక్ష సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించడంతో శాసన సభలో వరుసగా రెండో రోజు గురువారం గందరగోళ పరిస్థితి నెలకొంది.

- 8లో



భక్తిశ్రద్ధలతో పూజలు

కీర్తీక మాస పర్వదినాల్లో భాగంగా గురువారం ఏకాదశి పురస్కరించుకొని ఆలయాలు కిటకిటలాడాయి. .

- 8లో

న్యూస్‌రీల్

హత్య కేసులో నిందితులు అరెస్టు



నిందితులను చూపిస్తున్న పోలీసులు

బరంపురం: బరంపురం పోలీసు జిల్లాలో కొద్దిరోజుల క్రితం జరిగిన యువకుడి హత్య కేసులో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు నిందితులను గొళంతరా పోలీసులు అరెస్టు చేసిన ఘటన స్థానికంగా చర్చనీయాంశం అయ్యింది. ఐఐసీ అధికారి వివేక నంద పోలయి తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 20వ తేదీన గొళంతర పోలీసుస్టేషన్ పరిధి చందిపూర్‌లో టుటు నాయక్‌ను ప్రేమ వ్యవహారంలో నిందితులు గొంతుకోసి హత్య చేసినట్లు వెల్లడించారు. ఘటనపై గొళంతరా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి, హత్యకి సబంధించి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టైన వారిలో కన్నాహ దాస్, గణేష్ దాస్, సంతోష్ దాస్, సునీత దాస్‌లు ఉన్నట్లు గుర్తించారు.

పేకాటలో గొడవ

- మేనల్లుడిని చంపిన మేనమామ



అరెస్టైన నిందితుడు ఘాశీ గదబ

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితిలో పేకాటలో తలెత్తిన గొడవ హత్యకు దారితీసింది. ఒక వ్యక్తి తన సొంత మేనల్లుడిని గొడ్డలితో కొట్టి చంపిన సంఘటన చోటుచేసుకుంది. నిందితుడిని అరెస్టు చేసినట్లు బొయిపరిగుడ పోలీసు అధికారి శుశాంత కుమార్ శతపతి గురువారం తెలియజేశారు. కాతపడ గ్రామ పంచాయతీ సారుజబా గ్రామంలో ఘటన జరిగినట్లు పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సారుజబా గ్రామంలో రెండు రోజుల క్రితం మృతుడు లెరి గదబ, అతడి మేనమామ ఘాశీ గదబ మరికొంత మంది కలిసి పేకాట ఆడారు. ఆ సమయంలో మేనమామ ఘాశీ గదబ, మేనల్లుడు లెరి గదబల మధ్య గొడవ జరిగింది. మిగతావారు ఇరువురిని సముదాయించి శాంతింపజేశారు. అయితే కోపం చల్లారని ఘాశీ గదబ తన మేనల్లుడిని చంపుతానని హెచ్చరించాడు. అనంతరం లెరి గదబ ఒక కర్ర తీసుకొని మామ ఘాశీని కొట్టేందుకు రాగా, లెరి తన భార్యను చంపేందుకు వచ్చాడని భావించి ఘాశీ తన భుజంపై ఉన్న గొడ్డలితో లెరి గదబపై దాడి చేశారు. ఆ దెబ్బకు లెరి గదబ కిందపడి సంఘటనా స్థలం వద్దనే మరణించాడు. లెరి మరణించడంతో ఘాశీ అక్కడ నుంచి పరారయ్యాడు. సమాచారం తెలియడంతో బొయిపరిగుడ పోలీసులు వెంటనే సంఘటన ప్రాంతానికి వెళ్లి దర్యాప్తు జరిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ఊహలకు రూపం..!



ఉత్తమ ప్రాజెక్టులు ప్రదర్శించినవారిని బహుమతులతో సత్కరిస్తున్న దృశ్యం



ఆకట్టుకుంటున్న విద్యార్థిని ప్రాజెక్టు



విజ్ఞాన ప్రదర్శనలు ప్రారంభిస్తున్న బీడీవో శక్తి మహాపాత్రో

- ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శనలు

చిట్టి బుర్రలకు చిన్నారులు పదును పెట్టారు. అద్భుతమైన ఆవిష్కరణలు రూపొందించి అబ్బురపరిచారు. జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం నిర్వహించిన డివిజన్ స్థాయి రాష్ట్రీయ బాల విజ్ఞాన ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు వారి ప్రతిభకు అద్దంపట్టాయి. ఒక విద్యార్థిని స్పీడ్ బేకర్ల ద్వారా వాహన ప్రమాదాలు నివారించడంతో పాటు విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని తన ప్రాజెక్టు ద్వారా చూపించారు. మరో విద్యార్థిని శాటిలైట్ ద్వారా పొందుతున్న సైకర్యాలు తన ప్రాజెక్టు ద్వారా వివరిస్తూ, భవిష్యత్తులో పెరిగే అవసరాలకు అనుగుణంగా శాటిలైట్ విజ్ఞానాన్ని విస్తరింపజేయాల్సిన అవసరాన్ని విపులీకరించింది. ఇలా ప్రతీ విద్యార్థి తమ ఆలోచనలకు అనుగుణంగా తయారు చేసిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సమితి బీడీవో శక్తి మహాపాత్రో, బ్లాక్ విద్యాధికారి చందన నాయక్, విక్రమదేవ్ వర్సిటీ రిజిస్ట్రార్ దేవీప్రసాద్ మిశ్ర, ఆల్ ఇండియా రేడియో స్టేషన్ డైరెక్టర్ నరేంద్రనాథ్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

– జయపురం



విజ్ఞాన ప్రదర్శనలు తిలకిస్తున్న ప్రజలు



స్పీడ్ బ్రేకర్ల ద్వారా విద్యుత్ సేకరణపై ప్రాజెక్టు వివరిస్తున్న విద్యార్థిని



వాహనాల హైడ్రాలిక్ పార్కింగ్ ప్రాజెక్టుపై వివరిస్తున్న విద్యార్థిని



మలుపుల వద్ద సురక్షితంగా వాహనాలు వెళ్లే ప్రాజెక్టు ప్రదర్శన



శాటిలైట్ వ్యవస్థ ప్రాముఖ్యతను తెలుపుతున్న విద్యార్థినులు



ఒక గ్రామ మౌలిక అవసరాలను తెలియజేస్తున్న ప్రాజెక్టు ప్రదర్శన

షాక్..!





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

- తల తిరగడంతో పాఠశాల మొదటి అంతస్తు నుంచి పడిపోయిన విద్యార్థిని
- అనంతరం 10 మంది విద్యార్థులకు అస్వస్థత
- జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స

రాయగడ: స్థానిక బారిజోలలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో చదువుతున్న 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆందోళన చెందిన స్కూల్ సిబ్బంది చికిత్స కోసం విద్యార్థులను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం తరలిస్తున్నారు. గురువారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. ఎప్పటిలాగే తరగతులకు వెళ్లిన విద్యార్థులు ఉదయం పదిన్నర గంటల సమయంలో బ్రేక్ టైమ్ కావడంతో వారు తీసుకొచ్చిన అల్పాహారాన్ని తిన్నారు. ఈ క్రమంలో పదో తరగతి చదువుతున్న ఆరాధన మిశ్రో అనే విద్యార్థినికి వికారంగా ఉండడంతో వాష్ రూమ్‌కి వెళ్లింది. మొదటి అంతస్తులోని వాష్ రూమ్‌కి వెళ్లి వస్తున్న సమయంలో కళ్లు తిరిగి అంతస్తు నుంచి కిందకి పడిపోయింది. దీంతో సమాచారం అందుకున్న స్కూల్ సిబ్బంది ఆమెను తీసుకొచ్చి తరగతి గదిలో కొంతసేపు ఉంచిన అనంతరం జిల్లా కేంద్రం ఆస్పత్రికి తరలించారు. ఆమెకు చికిత్స చేస్తున్న సమయంలో జరిగిన ఘటనపై షాక్‌తో వరుసగా మరో పది మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆందోళన చెందిన స్కూల్ సిబ్బంది విద్యార్థులను వెంటనే బస్సులో ఆస్పత్రికి తరలించారు.

ఇది సహజమే...

ఒక్కసారిగా పది మంది విద్యార్థులు అస్వస్థతకు గురవ్వడంతో వెంటనే చికిత్స అందించారు. కొంత మందికి ఆక్సిజన్ లెవల్స్ తగ్గుముఖం పట్టడంతో వారికి ఆక్సిజన్ అందించారు. తోటి విద్యార్థిని కిందికి పడిపోవడంతో షాక్‌కు గురైన మిగతావారు ఇలా అస్వస్థతకు గురవ్వడం సహజమేనని వైద్యులు చెప్పారు. వారి ఆరోగ్య పరిస్థితి మెరుగయ్యేందుకు కొద్ది సమయం పడుతుందన్నారు.



శ్రీచైతన్య టెక్నోస్కూల్

సుమారు రెండు గంటల పాటుగా చికిత్స అందించిన అనంతరం అస్వస్థతకు గురైన మోనాలిషా నాయక్, బిశ్వజిత్ సేనాపతి, కౌషిక్ రంజన్ బెహర, జి.సింధు, శివానీ చౌదరి, మంజిల్ దత్త, కె.ఇశ్వంతి, విశ్వభూషన్ సేనాపతి, సోనాలి జెన్న, బి.గణేష్‌లను ఇళ్లకు పంపించారు.

తల్లిదండ్రుల ఆందోళన

స్కూల్‌లో చోటుచేసుకున్న ఈ సంఘటన విషయం దావాణంలా పట్టణంలో వ్యాపించడంతో పాటు స్కూల్ యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లమని మెసేజ్‌లు పెట్టడంతో ఆందోళనతో తల్లిదండ్రులు స్కూల్‌కి చేరుకున్నారు. తమ పిల్లల ఆరోగ్యం గురించి వివరాలు తెలుసుకున్నారు. సురక్షితంగా ఉన్నప్పటికీ వారిని తమవెంట తీసుకువెళ్లిపోవడం కనిపించింది. మరి కొంతమంది తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. అసలు ఏం జరిగింది, ఎందుకు ఈ సమస్య ఎదురైందని ప్రశ్నల వర్షం కురిపించారు. స్కూల్‌లో నిర్వహణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని ఆరోపించారు. మరి కొంతమంది తల్లిదండ్రులు సమాచారం కోసంఫోన్లు చేసినా రిసెప్షన్‌లో సరైన సమాధానం ఇవ్వకపోవడంతో స్కూల్‌కు వచ్చి ప్రిన్సిపాల్‌పై మండిపడ్డారు.

ఊహించని ఘటన: ప్రిన్సిపాల్

తరగతుల బ్రేక్ టైమ్‌లో ఈ ఘటన చోటుచేసుకుందని ప్రిన్సిపాల్ ఎం.రజని తెలియజేశారు. వెంటనే తమ సిబ్బంది స్పందించి చికిత్స కోసం విద్యార్థులను జిల్లా కేంద్రాస్పత్రికి తరలించడం జరిగిందన్నారు. అసలు ఏం జరిగిందో తమకే అర్థం కావడం లేదని సమాధానం చెప్పారు. తమ స్కూల్‌లో భోజన సౌకర్యాలు వంటివి లేవని, విద్యార్థులే ఇంటి నుంచి వారి అల్పాహారం, భోజనాలు తీసుకువస్తుంటారని వివరించారు.



గాయాలతో చికిత్స పొందుతున్న అనురాధ మిశ్రో



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

గిరిజనుల ప్రయోజనాలు పరిరక్షించాలి



రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్‌ని కలిసిన బీజేపీ ఎమ్మెల్యేల బృందం

- గవర్నర్‌కు బీజేపీ ఎమ్మెల్యేల వినతి

భువనేశ్వర్: గిరిజనుల భూమిని గిరిజనేతరులకు బదిలీ చేయడం, విక్రయించడంపై రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్రంలో ప్రతిపక్ష రాజకీయ పార్టీలు గురువారం తమ నిరసనను తీవ్రతరం చేశాయి. ఈ అంశంపై విపక్షాల కలకలంతో శాసనసభ శీతాకాల సమావేశాలు వరుసగా రెండో రోజు స్తంభించాయి. ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఎమ్మెల్యేలు రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్‌ను కలిశారు. మంత్రి మండలి చర్యను పూర్తిగా ఉపసంహరించుకునేలా జోక్యం చేసుకోవాలని గవర్నర్‌కు అభ్యర్థించారు. స్థానిక రాజ్‌భవన్‌లో బీజేపీ శాసన సభ్యుల ప్రతినిధి బృందం గవర్నర్‌ను కలిసి, ఒడిశా షెడ్యూల్డ్ ప్రాంతాల బదిలీ స్థిరాస్తి షెడ్యూల్డ్ తెగల నియంత్రణ, 1956 సవరణపై మంత్రి మండలి నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం సమర్పించింది. రాష్ట్ర కేబినెట్ నిర్ణయాన్ని ఖండిస్తూ రాష్ట్రంలోని గిరిజన ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యేల ప్రతినిధి బృందం గవర్నర్‌ను అభ్యర్థించిందని సీనియర్ బీజేపీ నాయకుడు మరియు ప్రతిపక్ష చీఫ్ విప్ మోహన్ చరణ్ మాఝీ తెలిపారు. ఈ అంశంపై సభలో విపక్షాల దాడికి గురైన ప్రభుత్వం మంత్రి మండలి నిర్ణయాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్లు పేర్కొన్నప్పటికీ, ఈ చర్యను పూర్తిగా ఉపసంహరించుకోవాలని ప్రధాన విపక్షం బీజేపీ పట్టుబట్టింది. గిరిజన సలహా మండలి (టీఏసీ) సిఫార్సును ఉటంకిస్తూ షెడ్యూల్డ్ ఏరియాలో గిరిజనేతరులకు చెందిన గిరిజనులకు చెందిన స్థిరాస్తులను బదిలీ చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం సబబు కాదని విపక్ష నేతలు ఆరోపించారు.

ఇదీ విషయం

ఈ ఏడాది జూలై 11న జరిగిన గిరిజన సలహా మండలి సమావేశంలో వ్యవసాయం, నివాస గృహాల నిర్మాణం మరియు పిల్లల ఉన్నత చదువుల కోసం బ్యాంకు రుణాలు పొందేందుకు షెడ్యూల్డ్ తెగలకు సడలింపును ప్రతిపాదించినట్లు తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ తెగకు చెందిన స్థిరాస్తిని షెడ్యూల్డ్ ప్రాంతంలోని షెడ్యూల్డ్ తెగకు కాకుండా ఇతరులకు బదిలీ చేయడానికి ఆమోదించిందని, ఇది టీఏసీ సమావేశంలో నిర్ణయించబడలేదని బీజేపీ ఎమ్మెల్యేల బృందం స్పష్టం చేసింది. ప్రభుత్వ ఉద్దేశంపై సందేహాన్ని లేవనెత్తుతూ బీజేపీ శాసన సభ్యులు క్యాబినెట్ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. దీనిని వారు 'ఆదివాసీ వ్యతిరేకం' అని వ్యాఖ్యానించారు.

క్లుప్తంగా

అలంబర్‌లో తిష్టవేసిన పెద్దపులి



కుమ్మలిసింగిలో ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు

పర్లాకిమిడి: జిల్లాలోని రాయఘడ బ్లాక్ కుమ్ములి సింగి పంచాయతీ అలంబర్ గ్రామ సమీపంలో పెద్దపులి తిరుగుతున్నట్లు పాదముద్రల ద్వారా నిర్ధారించినట్లు అటవీ సంరక్షణ అధికారి అశోక్ కుమార్ బెహరా గురువారం తెలియజేశారు. అందువలన అలంబర్, సురంగి, జంగలో, బరేయి, కుమ్ములిసింగి, కిలాస్ సాహి, బోరియల్ ఆదివాసీ గ్రామాల్లో డప్పు చాటింపుతో ప్రజలకు హెచ్చరికలు చేశారు. అలాగే పెద్దపులి పొరుగున ఉన్న నువాగడ, గుమ్మా ప్రాంతాలకు వెళ్లే అవకాశాలు ఉండడంతో అక్కడ సైతం అప్రమత్తం చేశారు. ఇదిలా ఉండగా రెండురోజుల క్రితం కుమ్ములిసింగి గ్రామంలో పెద్దపులి ఒక ఆవును చంపినందుకు ప్రభుత్వం రూ.37,500లు నష్టపరిహారం మంజూరు చేయడం జరిగిందని ఏసీఎఫ్ బెహరా తెలియజేశారు.

కోల్‌కతా సందర్శనకు గిరిజన యువత



పయనమవుతున్న గిరిజన యువతతో బీఎస్‌ఎఫ్ జవాన్లు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రం ఎంవీ 3 గ్రామం వద్దనున్న బీఎస్‌ఎఫ్ హెడ్ క్వాటర్స్ నుంచి గిరిజన యువకులు కోల్‌కతా సందర్శనకు వెళ్లారు. ఈ సందర్భంగా బీఎస్‌ఎఫ్ డీఐజీ సైలేంద్ర సిన్హా మాట్లాడుతూ.. చిత్రకొండ సమితిలోని 5 గ్రామాలకు చెందిన 20 మంది గిరిజన యువతను సందర్శనకు తీసుకెళ్తున్నట్లు తెలియజేశారు. వీరితో పాటు ఇద్దరు జవాన్లు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 24వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పర్యటన ఉంటుందన్నారు. గిరిజన యువతలో చైతన్యం తీసుకురావడం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

అక్రమంగా తరలిస్తున్న కలప సీజ్



దుంగలతో పట్టుబడిన నిందితుడు

రాయగడ: అక్రమంగా కలప దుంగలను ఆటోలో తరలిస్తున్న ఒక వ్యక్తిని జిల్లాలోని గుడారి అటవీ శాఖ సిబ్బంది పట్టుకున్నారు. అతని నుంచి 5 విలువైన కలప దుంగలను స్వాధీనం చేసుకున్నారు. గుడారి అటవీ పరిధి కెందుగుడ ఫారెస్టర్ నరసింహ సేనాపతి నేతృత్వంలో కామదేవ్ సాబొరా, సరస్వతి సాబొరా తదితర సిబ్బంది బుధవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహించారు. దీనిలో భాగంగా బాలాజీగుడ వద్ద తారాసపడిన ఆటోను ఆపి తనిఖీ చేయగా అందులో కలప దుంగలు పట్టుబడ్డాయి. వీటి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని అంచనా వేశారు. నిందితుడు ఎస్.సంతోష్‌ను అరెస్టు చేసి, ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

అంబులెన్స్‌లు ప్రారంభం



ప్రారంభమైన అంబులెన్స్‌లు

మల్కన్‌గిరి: జిల్లాలోని ప్రభుత్వాస్పత్రిలో 10 అంబులెన్స్‌లను జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రాణ ప్రణబ్‌పతి గురువారం ప్రారంభించారు. మారుమూల గ్రామాలకు అంబులెన్స్‌లు అందుబాటులో ఉండాలనేది సీఎం నవీన్ పట్నాయక్ ఆశయమన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ప్రఫుల్ల కుమార్ నందో తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ గందరగోళం

- గిరిజనుల భూ బదలాయింపుపై స్తంభించిన అసెంబ్లీ
- సభా కార్యక్రమాలు వాయిదా వేసిన స్పీకర్



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బీజేపీ ఎమ్మెల్యేలు

భువనేశ్వర్: గిరిజనుల భూములను గిరిజనేతరులకు బదలాయించవచ్చని రాష్ట్ర ప్రభుత్వ వివాదాస్పద నిర్ణయాన్ని ప్రతిపక్ష భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించడంతో రాష్ట్ర శాసన సభలో వరుసగా రెండో రోజు గురువారం కూడా గందరగోళ పరిస్థితి నెలకొంది. సభ ప్రారంభమైన వెంటనే బీజేపీ ఎమ్మెల్యేలు సభ వెల్‌లోకి దూసుకెళ్లి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. గందరగోళం మధ్య స్పీకర్ ప్రమీలా మల్లిక్ సభను వాయిదా వేశారు. ప్రతిపక్ష విప్ మరియు బీజేపీ ఎమ్మెల్యే మోహన్ చరణ్ మాఝీ మాట్లాడుతూ సభలోని ఇతర కార్యకలాపాలను నిలిపివేసి భూ బదలాయింపు సవరణ అంశంపై చర్చించడానికి వాయిదా తీర్మానాన్ని అనుమతించాలన్న తమ అభ్యర్థనను స్పీకర్ తిరస్కరించారన్నారు. మంత్రి మండలి ఈ సవరణ నిర్ణయాన్ని ఉపసంహరించేంత వరకు బీజేపీ నిరవధికంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.

ఇదీ విషయం

గిరిజనుల భూమిని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థల్లో తనఖా పెట్టేందుకు, గిరిజనేతరులకు బదిలీ చేసేందుకు వీలుగా నిబంధనల సవరణలకు రాష్ట్ర మంత్రి వర్గం ఇటీవల ఆమోదం తెలిపి చిక్కుల్లో పడింది. ఈ పరిస్థితి దృష్ట్యా ప్రభుత్వం తన నిర్ణయాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. అయితే బీజేపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సభా కార్యక్రమాలను అడ్డుకోవడాన్ని చౌకబారు రాజకీయంగా రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సుదామ్ మరాండీ వ్యాఖ్యానించారు. ఒడిశా షెడ్యూల్డ్ ప్రాంతాల బదలాయింపు స్థిరాస్తి (షెడ్యూల్డ్ తెగల ద్వారా) రెగ్యులేషన్ చట్టం 1956పై నిర్ణయం తీసుకునే అధికారం భారత రాష్ట్రపతికి మాత్రమే ఉందని, మంత్రివర్గానికి కాదని ఆయన తెలిపారు. ఈ సమస్యపై విపక్షాల గందరగోళ పరిస్థితుల దృష్ట్యా స్పీకర్ బుధ, గురువారాల్లో వరుసగా 2 రోజులు సభను వాయిదా వేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. మరోవైపు ప్రభుత్వం ఒడిశా భూ సంస్కరణల (రెండవ సవరణ) బిల్లు– 2023ను ఉప – కౌలుదారులకు, కౌలుదారులకు లేదా వారసుల ప్రయోజనాలకు అనుగుణంగా రాయతీ హక్కులను ప్రదానం చేయాలని ప్రతిపాదించింది. దీని ప్రకారం ఆర్ ఓఆర్‌లో సిక్కిం అని నమోదు చేయబడిన ఇంటి స్థలాలను కలిగి ఉన్నవారు ప్రయోజనాలను పొందేందుకు చట్టం ప్రారంభమైన రెండేళ్లలోపు రెవెన్యూ అధికారికి దరఖాస్తు చేసుకోవాలి. రైతు హక్కుల కోసం భూమి యజమానులకు ఎకరానికి ప్రామాణిక పరిహారం రూ. 14,200గా నిర్ణయించారు. అటువంటి ఇంటి స్థలం మరియు వ్యవసాయ భూమిపై రాయతి హక్కులను ప్రకటించడానికి ప్రభుత్వం కాలపరిమితిని పొడిగించేందుకు వెసులుబాటు కల్పించిన ప్రతిపాదనని సభలో ప్రవేశ పెట్టింది.

విత్తన ఉత్పత్తి కీలకం



సైక్ కళాశాల నర్సరీ గ్రీన్ హౌస్ పరిశీలిస్తున్న జిల్లా ఏపీ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజర్ బాలకృష్ణ

ఎచ్చెర్ల క్యాంపస్: మెరుగైన వ్యవసాయ దిగుబడులకు విత్తనం, మేలు జాతి మొక్కల ఉత్పత్తి కీలకమని జిల్లా ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజర్ పి.బాలకృష్ణ అన్నారు. సంతసీతారాంపురం గ్రామంలోని సైక్ వ్యవసాయ కళాశాలలో విత్తనం, మొక్కలు ఉత్పత్తి గ్రీన్ హౌస్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఏజీ బీఎస్సీ విద్యార్థులు వ్యవసాయ లాభసాటి కోసం కృషిచేయాలని అన్నారు. తక్కువ ధరకు మంచి నాణ్యమైన విత్తనాలు అందజేయడం, రైతులకు అంటు, క్లోనింగ్ వంటి మొక్కలు అందజేసేందుకు కృషిచేయాలని సూచించారు. ఈ ప్రాంతంలో రైతులు ప్రాధాన్యత ఇస్తున్న కొబ్బరి, జీడి మామిడి, మామిడి, ఇతర ఉద్యాన వన మొక్కలు నర్సరీల్లో పెంచాలని చెప్పారు. ఏసీ సీడ్ కార్పొరేషన్ విద్యార్థులకు తమ వంతు సహకరిస్తుందని తెలిపారు. విద్యార్థులు సేంద్రీయ పద్ధతిలో సాగు చేసిన వరి విత్తనాలకు ఆర్గానిక్ ధ్రువీకరణ అందజేయాలని కోరారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ నర్సరీలు, విత్తన ఉత్పత్తి సంస్థలు వ్యాపార ప్రయోజనాల కోసం పనిచేస్తాయని, విద్యార్థులు రైతుల ప్రయోజనాలు కోసం కృషిచేస్తున్నారని అన్నారు. వ్యవసాయ శాస్త్ర విద్యార్థులు పరిశోధనలు, నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కళాశాలల్లో విత్తన ఉత్పత్తి, నర్సరీల పెంపకానికి ఇస్తున్న ప్రాధాన్యతను డీన్ డాక్టర్ కె.మోషె వివరించారు.

అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్‌కు ఇద్దరు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం లత, సిబ్బంది

ఇచ్ఛాపురం: విశాఖపట్టణంలోని పోర్టు స్టేడియంలో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న అంతర్జాతీయ వాడో కాయ్ కరాటే ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పురుషోత్తపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వై.లత తెలిపారు. జూన్‌లో జరిగిన జాతీయ కరాటే పోటీల్లో టి.సాయిప్రియ, డి.పూజలు బంగారు పతకాలు సాధించి అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ మేరకు పురుషోత్తపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం అభినందించారు. కార్యక్రమంలో కరాటే కోచ్ ప్రకాష్, ఉపాధ్యాయులు రాజగోపాల్, రాంప్రసాద్, తేజేశ్వరరావు, జయలక్ష్మి, సత్యవాణి, ఆదిలక్ష్మి, పిఈటి సూర్య, సిఆర్‌పి మోహన్, దర్మారావు తదితరులు పాల్గొన్నారు.

స్కూటీ, బైక్ ఢీ: వీఆర్‌ఓకు తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీఆర్‌ఓ మౌనికకు

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళంలోని డేఅండ్‌నైట్ జంక్షన్ సమీపంలోని విజయ గణపతి ఆలయం వద్ద గురువారం స్కూటీ బైక్‌ను ఢీకొన్న ఘటనలో బొడిగి మౌనిక అనే వీఆర్‌ఓ తీవ్రంగా గాయపడ్డారు. ట్రాఫిక్ ఎస్‌ఐ ఎస్ఎస్ దొర చెప్పిన వివరాల మేరకు.. ఎచ్చెర్ల మండలం కొత్తపేట గ్రామానికి చెందిన బొడిగి గోవిందరావు, ఉమాదేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె మౌనిక నాలుగేళ్లుగా శ్రీకాకుళంలోని రైతు బజారు సచివాలయంలో వీఆర్‌ఓగా పనిచేస్తున్నారు. ఆమె గురువారం మధ్యాహ్నం తహసీల్దారు కార్యాలయానికి వెళ్లేందుకు పాలకొండ రోడ్డులో వెళ్తుండగా.. డేఅండ్‌నైట్ జంక్షన్ నుంచి ఏడురోడ్ల కూడలి వైపు వెళ్తున్న యువకుడు తర్రా కూర్మారావు తన ఎఫ్‌జెడ్ బైక్‌తో వేగంగా వచ్చి మౌనిక స్కూటీని ఢీకొట్టాడు. దీంతో ఇద్దరూ కింద పడిపోయారు. మౌనిక తలకు గాయమైంది. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ వెంకటరావు, ఉప తహసీల్దార్ రాజు, సహచర వీఆర్వోలు రిమ్స్‌కు వెళ్లి చూశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మౌనికను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన యువకుడు కూర్మారావుది కోటబొమ్మాళి మండలం సుబ్బారావుపేట గ్రామం. పోలీసులు దీనిపై కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో కాంపౌండర్ దుర్మరణం



పలాస జాతీయ రహదారిపై విగతజీవిగా నెయ్యిల రమేష్

కాశీబుగ్గ: పలాస మండలం రామకృష్ణాపురం రెవెన్యూ పరిధిలోని కోసంగిపురం కూడలి జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో మందస మండలం మధ్యదేవుపురం గ్రామానికి చెందిన నెయ్యిల రమేష్(42) మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. నెయ్యిల రమేష్ కాశీబుగ్గలోని శ్రీరాజేశ్వరి నర్సింగ్ ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తున్నారు. గురువారం ఉదయం స్వగ్రామం నుంచి కాశీబుగ్గ ఆస్పత్రికి బైక్‌పై వెళ్తుండగా హైవేపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, నేషనల్ హైవే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడికి భార్య నీలవేణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అప్పటి వరకు ఇంటిలోనే ఉండి బయల్దేరిన కాసేపటికే చావు వార్త వినిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ సంఘటనతో దేవుపురం గ్రామంలో విషాద ఛాయలు చోటుచేసుకున్నాయి. కాశీబుగ్గ పోలీసు స్టేషన్ ఏఎస్‌ఐ గణపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు.

పర్లాకిమిడిలో జాబ్‌మేళా



జాబ్‌మేళా వేదికపై అధికారులు, ప్రజాప్రతినిధులు

పర్లాకిమిడి: స్థానిక గజపతి స్టేడియంలో గజపతి జిల్లాస్థాయి జాబ్‌మేళాను బరంపురం ఎంపీ చంద్రశేఖర సాహు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ఉపాధితో పాటు అన్ని సౌకర్యాలు పొందాలన్నదే సీఎం నవీన్ పట్నాయక్ ఆశయమన్నారు. జాబ్‌మేళాకు 30 నుంచి 33 కంపెనీలు వచ్చాయని, నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకుని ఉపాధి పొందాలని సూచించారు. ఆయనతో పాటు జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్, స్పెషల్ డవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ మరియం రైయితో, డీఆర్‌డీఏ సీడీఎం గుణనిధి నాయక్, పరిశ్రమల అధికారి సునారాం సింగ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈనెల 24న నువాగడ బ్లాక్ అనుగురు పంచాయతీలో మరో జాబ్ మేళా జరగనుంది.



మాట్లాడుతున్న ఎంపీ చంద్రశేఖర్ సాహు



జాబ్‌మేళాకు విచ్చేసిన నిరుద్యోగ యువత



రిజిస్ట్రేషన్ చేసుకున్న నిరుద్యోగులు

స్టేట్ మీట్‌కు ఏర్పాట్లు



కేశవరావుపేట ఉన్నత పాఠశాలలో బాల్ బ్యాడ్మింటన్ కోర్టులు పరిశీలిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట, ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం నుంచి ఈ నెల 26 వరకు నిర్వహించనున్న 67వ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏర్పాట్లను గురువారం రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పీవీ కృష్ణంరాజు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, హెచ్‌ఎం చల్లా భారతితో కూడిన అధికారులు పరిశీలించారు. పాత 13 జిల్లాల నుంచి అండర్ 14, 17, 19 (బాలురు) బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు 390 మంది వరకు హాజరు కానున్నారు. కేశవరావుపేట ఉన్నత పాఠశాలలో ఆరు కోర్టులు, ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐదు కోర్టులు ఏర్పాటు చేశారు. అండర్–14, 17 క్రీడాకారులకు కేశవరావుపేట ఉన్నత పాఠశాలలో, అండర్–19 క్రీడాకారులకు ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వసతి కల్పించారు. క్రీడల ప్రారంభోత్సవానికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నారు.

రైల్వే ఉద్యోగి ఇంట్లో చోరీ



ఇంట్లో చిందరవందరగా పడిఉన్న వస్తువులు

రాయగడ: స్థానిక సీతమ్మనాయుడు కాలనీలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. కాలనీలోని అద్దె ఇంట్లో నివాసముంటున్న రైల్వే ఉద్యోగి ప్రమోద్ కుమార్ పాశ్వన్ కుటుంబీకులు ఇటీవల గుజరాత్ వెళ్లారు. ఉద్యోగ రీత్యా పాశ్వన్ ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. ఎప్పటిలాగే బుధవారం విధులు నిర్వహించి ఇంటికి తిరిగి వచ్చే సమయానికి, ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో లోపలికి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడి ఉండడం గమనించి దొంగతనం జరిగినట్లు అనుమానించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటన స్థలానికి గురువారం చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. రూ.5 వేల నగదు, 5 గ్రాముల బంగారం దొంగలించినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఘనంగా సత్యసాయి జన్మదిన వేడుకలు



సత్యసాయి బాబా పల్లకీని మోస్తున్న భక్తులు

పర్లాకిమిడి: పట్టణంలోని రాజవీధిలో సత్యసాయి బాబా 98వ జన్మదిన వేడుకలు సందర్భంగా శోభాయాత్రను కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ యాత్రలో సత్యసాయి ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు బాబా భక్తులు నగర కీర్తన చేసుకుంటూ పాల్గొన్నారు. అనంతరం బాబా మందిరంలో భజనలు చేసి, అల్పాహారం ఉచితంగా అందజేశారు.

ఐదున్నర కిలోల గంజాయి పట్టివేత

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి అక్రమంగా ఐదున్నర కిలోల గంజాయిని తరలిస్తున్న లారీని ఎస్ఈబీ సిబ్బంది పట్టుకున్నారు. ఎస్ఈబీ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. టీఎన్ 52 ఎల్ 7662 నంబర్ గల లారీలో అనుగుల్ నుంచి కోయంబత్తూర్‌కు ఐరన్ ఓర్ లోడ్‌తో తమిళనాడుకి చెందిన డ్రైవర్ ఆరోగ్యదాస్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఒడిశాలోని గిరిసోల వద్ద 5 కేజీల 450 గ్రాముల గంజాయిని కొనుగోలు చేసి లారీ ద్వారా తరలిస్తున్నాడు. ఈ లారీని లొద్దపుట్టి వద్ద గురువారం ఎస్ఈబీ సిబ్బంది, ప్రత్యేక బృందం వారు తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. లారీని సీజ్‌చేసి గంజాయిని స్వాధీనం చేసుకొని, డ్రైవర్ ఆరోగ్యదాస్‌ని అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ ఎస్ఐ గురుమూర్తి సిబ్బంది తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

కార్తీక మాస పర్వదినాల్లో భాగంగా గురువారం ఏకాదశి పురస్కరించుకొని ఆలయాలు కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాల వద్ద బారులుతీరారు. అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



బరంపురం: కోర్టుపేట జగన్నాథ్ ఆలయంలో ఏకాదశి పూజలు చేస్తున్న భక్తులు



రాయగడ: జగన్నాథ మందిరం వద్ద బారులుతీరిన భక్తులు



బరంపురం: సత్య నారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్న దృశ్యం



బరంపురం: జగన్నాథ్ ఆలయంలో ప్రత్యేక ఏకాదశి పూజలు చేస్తున్న దృశ్యం



బరంపురం: కోర్టుపేట జగన్నాథ్ ఆలయంలో ఏకాదశి పూజలు చేస్తున్న భక్తులు



బరంపురం: జగన్నాథ్ ఆలయంలో కిక్కిరిసిన భక్తులు



బరంపురం: శ్రీవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు



రాయగడ: సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

క్లుప్తంగా

బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్ర పరిశీలకుడిగా అజయ్‌కుమార్

రాజాం సిటీ: ఈ నెల 24 నుంచి 26 వరకు శ్రీకాకుళం జిల్లా కేశవరావుపేటలో జరగనున్న బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు రాష్ట్ర పరిశీలకుడిగా ఎంపికయ్యానని పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ పి.అజయ్‌కుమార్ తెలిపారు. 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17, 19 రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయన్నారు. ఈ మేరకు గురువారం కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి ఉత్తర్వులు అందాయని తెలిపారు. ఆయన ఎంపికపట్ల హెచ్ఎం శాసపు సత్యనారాయణ, బాల్‌బ్యాడ్మింటన్ సంఘం జిల్లా అధ్యక్షుడు కోత పూర్ణచంద్రరావు, ప్రధాన కార్యదర్శి పీవీజీకే రాజు, కోశాధికారి బీహెచ్ అరుణ్‌కుమార్‌లతోపాటు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

అంతర్జాతీయ డ్యాన్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మున్నా మైఖేల్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల

విజయనగరం: అంతర్జాతీయ స్థాయి డ్యాన్స్ పోటీల్లో నగరానికి చెందిన మున్నా మైఖేల్ డ్యాన్స్ అకాడమీ మూడోస్థానంలో నిలవడం ఆనందంగా ఉందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం కోలగట్ల తన స్వగృహంలో అకాడమీ విజేతలైన వంశికా సింగ్, దర్శన్ సురానా, ప్రదీప్ కుమార్‌లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అకాడమీ చైర్మన్ మున్నా మాట్లాడుతూ ఐఐజీఎఫ్ 2023 డ్యాన్స్ పోటీలు ఈ నెల 18, 19 తేదీల్లో శ్రీలంకలో జరిగాయన్నారు. అంతర్జాతీయ పోటీల్లో తమ అకాడమీ డ్యాన్సర్ ప్రతిభ కనబరిచి మూడోస్థానంలో నిలిచారన్నారు. కార్యక్రమంలో టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

లైంగిక దాడిపై కేసు నమోదు

మెంటాడ: మండలంలోని కుంటినవలస గ్రామానికి చెందిన మాదిరెడ్డి అప్పారావు(38) తనపై లైంగికదాడికి పాల్పడ్డాడంటూ అదే గ్రామానికి చెందిన వివాహిత (48) ఫిర్యాదు చేసిందని ఆంధ్ర ఎస్సై సిద్ధార్థ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని తన కళ్లంలో ఉన్న గేదెలకు పాలు తీయమని మాదిరెడ్డి అప్పారావును కోరడంతో సాయం చేశాడని అయితే తనను బలవంతంగా శాలలోకి లాక్కుని వెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఫిర్యాదు అందుకున్న తాము గ్రామానికి వెళ్లి సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశామని చెప్పారు. సీఐ అప్పలనాయుడు ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

జేఎన్‌టీయూ జీవీలో ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన



పుస్తక ప్రదర్శనలో విద్యార్థులు

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీలోని డాక్టర్ వైఎస్ఆర్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన పుస్తకప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. విశాఖ జ్యోతి బుక్ డిపో సంయుక్త నిర్వహణలో దాదాపు 2,200 పుస్తకాలు ఈ ప్రదర్శనలో ఉంచారు. ఇందులో ఇంజినీరింగ్ పుస్తకాలు 500 వాల్యూమ్‌లు, జనరల్ బుక్స్ 1,200 వాల్యూమ్‌లు, కాంపిటేటివ్ బుక్స్ 500 వాల్యూమ్స్ ప్రదర్శించారు. తొలుత ప్రదర్శనను ప్రారంభించిన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శన ద్వారా పుస్తకపఠనం అలవర్చుకోవడానికి వీలవుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.గురునాథ, ఆఫీసర్ ఇన్‌చార్జ్ లైబ్రరీ డాక్టర్ సి.నీలిమాదేవి, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ పద్మజ, డాక్టర్ నళిని, అసిస్టెంట్ లైబ్రేరియన్ జి.ఈశ్వరరావు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

డీసీఎంఎస్ బలోపేతానికి కృషి

రామభద్రపురం: డీసీఎంఎస్ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో గురువారం ఆమె మాట్లాడుతూ డీసీఎంఎస్ ఆధ్వర్యంలో రూ.20 కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని డీసీఎంఎస్‌లలో విజయనగరం 5వ స్థానంలో ఉందని, రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువులు, విత్తనాలు సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది 100 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేశామని చెప్పారు. రైతుల వద్ద సేంద్రియ బెల్లం కొనుగోలు చేసి విక్రయాలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోని డిజిటల్ తరగతి గదులలో మౌలిక సదుపాయాల కల్పిస్తున్నామని వివరించారు. సేంద్రియ వ్యవసాయం, మిల్లెట్స్ సేద్యంపై అవగాహన కోసం వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రామభద్రపురం పీఏసీఎస్ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్, కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నాయుడుబాబు, విక్రమ్ పాల్గొన్నారు.

పటిష్ట పర్యవేక్షణలో ప్రాథమిక విద్య

- విద్యాప్రమాణాలపై పక్క మండల అధికారులతో తనిఖీ
- మండలంలో రోజుకు రెండు ప్రాథమిక పాఠశాలల పరిశీలన



గుర్ల మండలంలోని శేషుపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

విజయనగరం అర్బన్: ఉన్నత పాఠశాలల్లో ఫలితాలు మెరుగుపడాలంటే ప్రాథమిక విద్య నుంచి బోధనలో నాణ్యత పెరగాలని జిల్లా విద్యాశాఖ గుర్తించింది. అందుకోసం ప్రాథమిక పాఠశాలల్లో విద్యా ప్రమాణాలపై పర్యవేక్షణ శైలిని మార్చింది. ఉపాధ్యాయుల బోధన సామర్థ్యం మరింత సమర్థవంతంగా ఉండాలని, ఆ దిశగా ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల బోధన నిర్వహణపై పర్యవేక్షణ పటిష్టత పెంచాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉన్న మండల స్థాయి విద్యాశాఖ అధికారుల తనిఖీలకు బదులుగా కొత్త విధానాన్ని ప్రారంభించింది. సమీప మండల విద్యాశాఖ అధికారి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బృందంగా తనిఖీల పద్ధతిని జిల్లా విద్యాశాఖ అమలులోకి తెచ్చింది. ప్రతి మండలంలోనూ రోజుకు రెండు ప్రాథమిక పాఠశాలల్లో తనిఖీలు నిర్వహిస్తారు. జిల్లా విద్యాశాఖ ఒక రోజు ముందు ఎంపిక చేసిన ఆ రెండు స్కూళ్లకు బృందాలు తనిఖీకి వెళ్తాయి. తనిఖీలు చేయాల్సిన అకడమిక్ అంశాలను ఫార్మాట్ రూపంలో నిర్దేశించారు. తరగతి సిలబస్ సకాలంలో పూర్తి చేస్తున్నదీ లేనిదీ, విద్యార్థి నోట్స్ బుక్ నిర్వహణ, వర్క్ బుక్‌లోని ప్రాక్టీస్ ప్రశ్నలపై విద్యార్థుల అవగాహన, విద్యార్థికి ఉన్న చదవడం, రాయడం సామర్థ్యాల పరిశీలన వంటి వాటిపై తనిఖీలో సమగ్రంగా పరిశీలించి నివేదిక తయారుచేయాలి. మరుసటి రోజున ఆ నివేదికను జిల్లాస్థాయి అధికారుల బృందం పరిశీలించాక ప్రమాణాలు లేని పాఠశాలల ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటారు. తొలుత షోకాజ్ నోటీస్ ఇచ్చి వారి వివరణ సంతృప్తిగా లేకపోతే ఇంక్రిమెంట్‌లో కోత ఉంటుంది. జిల్లా విద్యాశాఖ ఈ తనిఖీ విధానాన్ని గురువారం జిల్లాలోని 17 మండలాలల్లోనూ ప్రారంభించింది. తనిఖీ బృందం ఉపాధ్యాయుల ప్రలోభాలకు అవకాశం లేకుండా బృందాల తనిఖీపై డీఈఓ ఆకస్మిక తనిఖీ ఉంటుంది. జిల్లాలోని 1,804 ప్రభుత్వ పాఠశాలల్లో 1,344 ప్రాథమిక పాఠశాలున్నాయి. వాటిలో సెకండరీ గ్రేడ్ టీచర్లు 4,409 మంది విధులు నిర్వహిస్తున్నారు.

బోధన సామర్థ్యం లేని టీచర్లకు షోకాజ్ నోటీసులు

బోధన సామర్థ్యాలు ప్రదర్శించని ఉపాధ్యాయులపై చర్యలు తప్పవు. ఇటీవల జిల్లాలో చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో పలువురు ఉపాధ్యాయులను గుర్తించి వారికి నోటీసులు ఇచ్చాం. వారిచ్చే వివరణలు పరిశీలనలో ఉన్నాయి. బాగోకపోతే ఇంక్రిమెంట్‌లో కోత విధిస్తాం. తాజాగా ప్రాథమిక పాఠశాలల్లో తనిఖీల విధానాన్ని మార్చాం. సమీప మండలాల విద్యాశాఖ అధికారులతో తనిఖీలు చేపట్టే విధానాన్ని ప్రారంభించాం. జిల్లాస్థాయిలో ఎంపిక చేసిన రెండు పాఠశాలలను ఆ రోజుకు తనిఖీ చేయాలి. తనిఖీలను గుర్తించి విద్యార్థి ప్రగతి నివేదికను సమీక్షిస్తాం. బోధన సామర్థ్యాలు బాగోకపోతే సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటాం.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యం మెరుగుపరచాలి

గుర్ల: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని డీఈఓ లింగేశ్వరరెడ్డి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు గురువారం నిర్వహించిన శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. కొంతమంది విద్యార్థులకు చదవడం, రాయడం కూడా రావడం లేదని అలాంటి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

నాడు నేడుపై సమీక్ష

అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలో జరుగుతున్న నాడు -నేడు పనులపై డీఈఓ లింగేశ్వరరెడ్డి పాఠశాల హెచ్ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో 761 అంగన్‌వాడీ కేంద్రాలకు 4రకాల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి ఆయా గ్రామాల పాఠశాలల హెచ్ఎంలు కమిటీ సభ్యులుగా వేశారని, వారి ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో సదుపాయాల పనులను చేపట్టనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎస్ఎస్ఏ ఏఓ గోపీచంద్, ఎంఈఓ ఎస్.భానుప్రకాశ్, ఐసీడీఎస్ సీడీపీఓ ఆరుద్ర తదితరులు పాల్గొన్నారు.

అమ్మ స్వామివారి రాయబారి

- కొండవీటి జ్యోతిర్మయి



వేంకటేశ్వరస్వామి ఆలయంలో దేవుడమ్మతో కిరణ్మయి

మెంటాడ(గజపతినగరం రూరల్): కలియుగం దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి రాయబారిగా మరుపల్లి శివారు ప్రాంతంలో వెలసిన దేవుడమ్మ (పద్మావతి)ను చెప్పుకోవచ్చని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ గాయని కొండవీటి జ్యోతిర్మయి అన్నారు. ఈ మేరకు గురువారం ఆమె మరుపల్లి శివారు ప్రాంతంలో వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి విలేకరులతో మాట్లాడారు. గత 60 ఏళ్లగా ఈఆలయంలో స్వామివారిని నమ్ముకుని ఆహారాన్ని త్యజించి, ఒక్క కర్పూరం కలిపిన పానీయంతోనే జీవనాన్ని సాగిస్తూ స్వామివారి సన్నిధిలో గడుపుతున్న దేవుడమ్మ మహిమలు చెప్పనలవి కాదన్నారు. ఈ చుట్టు పక్కల గ్రామాల ప్రజలంతా సుభిక్షంగా సంతోషంగా జీవిస్తున్నారంటే ఆమె ఆశీస్సుల వల్లేనన్నారు. కోరిన కోర్కెలను తీర్చే సజీవ మూర్తి పద్మావతి అమ్మ అన్నారు. దేవుడమ్మ లాంటి ఉపాసకురాలు ఈప్రాంతంలో ఉందని సాధువుల ద్వారా విని రెండోసారి ఈప్రాంతంలో ఉన్న ఆమెను కుటుంబసమేతంగా దర్శించుకోవడం తన పూర్వజన్మ సుకృతమని చెప్పారు. ఆలయ అభివృద్ధికి టీటీడీ వారితో మాట్లాడి నిధులు మంజూరయ్యేలా చూస్తానని తెలిపారు.

సాయిరాం ఆలయ సందర్శన

సత్యసాయి 98వ జయంతి వేడుకల్లో భాగంగా మరుపల్లి గ్రామంలో ఉన్న ఆలయాన్ని కొండవీటి కిరణ్మయి సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి హారతి ఇచ్చి భక్తులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పాత్రో మాస్టారు. రాంబాబు, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, పాట్నూరు శ్రీనివాసరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కుమరాం గ్రామంలో జరిగిన గొడవల నేపథ్యంలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.దామోదరరావు తెలిపారు. గ్రామానికి చెందిన దీనుపల్లి శివ భార్య సీతమ్మలు తమ దంపతులపై దాడి చేసినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన రఘుమండ సత్యంనాయుడు, అతని సోదరుడు రఘుమండ సూరినాయుడుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు,మరో ముగ్గురిపై సాధారణ కేసు నమోదు చేశామన్నారు. అదే విధంగా గ్రామ వలంటీరు ఉప్పాడ రామప్పడు భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు దీనుపల్లి శివ కుటుంబసభ్యులపై కేసు నమోదు చేశామని వివరించారు.

బీసీ కులాల అభ్యున్నతికి చర్యలు

శ్రీకాకుళం న్యూకాలనీ:

బీసీ కులాల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. కొన్ని బీసీ కులాలను ఓబీసీలో చేర్చాలనే అంకం తుది దశకు చేరుకున్న నేపథ్యంలో శ్రీకాకుళంలోని కొన్ని బీసీ కులాల ప్రతినిధులను కలవడానికి వచ్చిన ఆయన స్థానికంగా ఓ హోటల్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎన్‌సీబీసీ రాజ్యాంగ సంస్థగా ఆవిర్భవించిన అనంతరం పార్లమెంటులో బీసీ కులాలను ఓబీసీలో చేర్చే విషయమై గత రెండేళ్లగా ఎన్నో విధాలుగా ప్రయత్నాలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. శ్రీకాకుళంతోపాటు ఉత్తరాంధ్రలోని ప్రధానంగా తూర్పు కాపు, కళింగవైశ్య, సొండి, శిష్ట కరణాలు, అరవల కులాలను బీసీల ఓబీసీలో చేర్చే ప్రక్రియ మరో వారం రోజుల్లో ముగుస్తుందని, ఈ విషయంలో ఎన్‌సీబీసీ తన పూర్తిస్థాయి రికమెండేషన్‌ను కేంద్రానికి వెల్లడించడం జరుగుతుందన్నారు. సామాజిక సాధికరత, సామాజిక న్యాయం చేయడంలో రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీతోపాటు అన్ని పార్టీలకు చెందిన ఆయా కులాల నాయకులు సహకరించారని సంతోషం వ్యక్తంచేశారు. కేంద్రం ఓబీసీ జాబితాలో ఈ ఐదు కులస్తుల పేర్లను చేర్చడంపై కేంద్రప్రభుత్వానికి జీవీఎల్ కృతజ్ఞతలు తెలిపారు. కళింగవైశ్య సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు కోణార్క్ శ్రీను మాట్లాడుతు ఓబీసీ జాబితాలో ఐదు కులాలను చేర్చే ప్రక్రియలో కీలకభూమిక వహించిన ఎంపీ జీవీఎల్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో కళింగ వైశ్యలను బీసీ-డీలో చేర్చిన సీఎం వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని సంతోషం వ్యక్తంచేశారు. వివిధ కుల సంఘాల జాతీయ, రాష్ట్ర ప్రతినిధులు ఎస్.కోటేశ్వరరావు, ఎన్.కోటేశ్వర చౌదరి, పోలుమహంతి ఉమామహేశ్వరరావు, కద్దాల శ్యామ్‌సుందరరావు, ఊన్న నాగరాజు, కోరాడ రమేష్, బీజేపీ జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, ఎంబీజే నాయకుడు పాల్గొన్నారు.

ఎండల మల్లన్న స్థల పురాణంపై పాట విడుదల

టెక్కలి: టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జున దేవస్థానం స్థల పురాణంపై పట్టణానికి చెందిన ఎస్‌వీఎం ఆర్ట్స్ ఆధ్వర్యంలో చిత్రీకరించిన పాటను గురువారం ఆలయ సన్నిధిలో విడుదల చేశారు. ఆలయ అర్చకుడు టి.యుగంధర్ నేతృత్వంలో ఎస్‌వీఎం ఆర్ట్స్ యూట్యూబ్ చానల్ ద్వారా చిత్రీకరించిన పాటను కార్యనిర్వాహణాధికారి ప్రసాద్‌బాబు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సుధాకర్, సర్పంచ్ సర్లాన బాలకృష్ణ తదితరులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సహ నిర్మాత భాస్కర్ పట్నాయక్, మల్లన్న భజన మండలి సభ్యుడు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల నిర్మాణాలపై దృష్టి

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఎంపీడీఓలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న ఈ పనులకు ఏ మాత్రం నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే పూర్తి చేసిన పనులకు బిల్లులు త్వరగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. 20 శాతం పనులు జరిగితే పూర్తయ్యే భవనాల విషయంలో ఎలాంటి అలసత్వం పనికి రాదన్నారు. ఏజెన్సీలు, ఇంజినీరింగ్ సిబ్బందితో ప్రతి వారం ఎంపీడీఓలు సమీక్షించి నేరుగా తనకు నివేదిక పంపాలని ఆదేశించారు.

27 నుంచి కులగణన

ఈ నెల 27 నుంచి జరగనున్న కులగణన సర్వేకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని, ఇప్పటికే అందరికీ శిక్షణ పూర్తయ్యిందని చెప్పారు. గ్రామాల వారీగా సర్వే సమాచారాన్ని రెండు రోజుల ముందే ప్రజలకు తెలిపేలా పత్రికా ప్రకటనలు స్థానికంగా విడుదల చేయాలని సూచించారు. గార మండలం రామచంద్రాపురం గ్రామంలో పైలెట్ సర్వే విజయవంతంగా పూర్తయిందని అన్నారు. జిల్లా కేంద్రంలో సర్వే కోసం హెల్ప్ లైన్ ఏర్పాటు చేశామని, సిబ్బంది తమ అనుమానాలు ఏవైనా ఉన్నా, క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తినా నేరుగా సంప్రదించాలని కోరారు.

ఆరోగ్యశ్రీ రిఫరెల్స్‌పై దృష్టి సారించాలి

జగనన్న ఆరోగ్య సురక్షలో 4 లక్షల మంది వైద్యులను కలిశారని, అందులో 5450 మందికి ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సలు అవసరమని గుర్తించగా వారిలో ఇప్పటివరకు 1583 మంది మాత్రమే నెట్‌వర్క్ ఆస్పత్రులకు వెళ్లి చికిత్సలు చేయించుకున్నారని, మిగిలిన వారు ఆస్పత్రికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వీరికి ఒక్కరికి రూ.500 చొప్పున ప్రయాణ భత్యం ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ ప్రత్యేక యాప్ ప్రతి ఒక్కరూ తమ సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకునేలా ప్రోత్సహించాలని చెప్పారు.

ఆడదాం ఆంధ్రకు కిట్లు

సెట్ శ్రీ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రాకు కిట్లు సిద్ధంగా ఉన్నాయని, ఆదివారానికి ఆయా ఎంపీడీఓలు వీటిని మండల కేంద్రాలకు తీసుకువెళ్లే బాధ్యత తీసుకోవాలని, ఆటల పోటీలు జరిగే రోజుల్లో ఆయా సచివాలయాలకు పంపించాలని చెప్పారు. వీటి రవాణా చార్జీల కోసం మండలానికి రూ.3000 చొప్పున చెల్లిస్తామని అన్నారు. కిట్లు ఎంతో నాణ్యతగా ఉన్నాయని, మైదానాలు సిద్ధం చేయడం, రిఫరీలను గుర్తించే పని వేగంగా పూర్తి చేయాలన్నారు.

26న వికసిత భారత సంకల్ప యాత్ర

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విధానాలకు సంబంధించి పౌరులకు అవగాహన కల్పించడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ అది చేరేలా పనిచేయడం వికసిత భారత సంకల్ప యాత్ర ప్రధాన ఉద్దేశమని, ఈనెల 26 నుంచి జిల్లాలో యాత్ర ప్రారంభం కానుందని రెండు నెలల పాటు కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ చెప్పారు. కాన్ఫరెన్స్‌లో గృహ నిర్మాణ పథకం గురించి సమీక్షించారు.

26న రాజ్యాంగ దినోత్సవం జరుపుకోవాలి

విజయనగరం అర్బన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవం జరపాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. జిల్లా అధికారులు తమ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం జరపడంతోపాటు తమ పరిధిలోని క్షేత్రస్థాయి కార్యాలయాల్లోనూ ఆ రోజు ఉదయం 11 గంటలకు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఒక సర్క్యులర్ జారీ చేశారు. ఆయా కార్యాలయాల్లో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ పీఠికను చదివి వినిపించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగే కార్యక్రమానికి కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని ప్రభుత్వ శాఖల అధికారులు, వారి సిబ్బంది ఉదయం 10.30 గంటలకు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

చట్టాలపై అవగాహన

శ్రీకాకుళం పాతబస్టాండ్: పారా లీగల్ వలంటీర్లు న్యాయ సేవాధికార సంస్థలకు అనుసంధానంగా పనిచేయాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఆయన గురువారం పారా లీగల్ వలంటీర్ల శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి మాట్లాడారు. చట్టాలపై అవగాహన పెంచుకుని ఉచితంగా న్యాయ సేవలు అందించడానికి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా లేబర్ చట్టాలపై అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శైలేష్ కుమార్, డొమెస్టిక్ వైలెన్స్ యాక్ట్ గురించి తలే లక్ష్మణరావు, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ కోసం డాక్టర్ బి.ప్రవీణ్, డాక్టర్ అనురాధ, సెక్సువల్ హెరాస్‌మెంట్ ఎట్ వర్క్ ప్లేస్ గురించి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం.ప్రవల్లిక, అసంఘటిత కార్మికుల నల్సా స్కీమ్ గురించి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు వివరించారు.

నేత్రపర్వంగా కార్తీక దీపోత్సవం



కె.కొత్తూరు గ్రామంలో షిర్డి సాయి మందిరం ఆవరణంలో నేత్ర పర్వంగా కార్తీక దీపోత్సవం

టెక్కలి: కార్తీక మాసం ఏకాదశి పర్వదినం సందర్భంగా కె.కొత్తూరు షిర్డి సాయి మందిరం ఆవరణలో గురువారం రాత్రి నేత్ర పర్వంగా కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. ఏలూరు శ్రీ యాజ్ఞవల్క్య రాజాశ్రమం పీఠాధిపతి కృష్ణ చరణానంద భారతి స్వామి నేతృత్వంలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరై కార్తీక దీపాలను వెలిగించారు.

అప్రెంటిస్‌తో కొలువు సులువు



వెల్డింగ్ నేర్చుకుంటున్న విద్యార్థి



కటింగ్ నేర్చుకుంటున్న విద్యార్థి

- ఉద్యోగానికి ముందే నైపుణ్యం పెంపు
- అప్రెంటిస్‌ను కీలకంగా భావిస్తున్న ఐటీఐ విద్యార్థులు
- పారిశ్రామిక అవసరాలు తెలుసుకుంటున్న వైనం

ఎచ్చెర్ల క్యాంపస్: ఉద్యోగానికి ముందే ఆ అంశంపై పట్టు సంపాదించడం, పరిశ్రమల్లో పనులపై అవగాహన పెంచుకోవడం, ఇంటర్వ్యూలను సమర్థంగా ఎదుర్కొగల నేర్పు నేర్చుకోవడం..ఏ విద్యార్థికైనా కీలకం. మరీముఖ్యంగా ఐటీఐ విద్యార్థులకు ఇవి తప్పనిసరి. అందుకే అప్రెంటిస్ పద్ధతిని ఐటీఐ విద్యార్థులు చాలా కీలకంగా భావిస్తున్నారు. అప్రెంటిస్‌షిప్ చేయడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. కోర్సులో ఉండగానే పరిశ్రమల అవసరాలు తెలుసుకునేందుకు ఆన్ జాబ్‌వర్క్ పేరుతో కాలేజీలు పరిశ్రమల పరిశీలనకు అవకాశం కల్పిస్తాయి. అప్రెంటిస్‌షిప్ తర్వాత పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఒకవేళ అప్రెంటిస్‌షిప్ లేకుండా ఉద్యోగ అవకాశాలు ఇచ్చినా ముందుగా పరిశ్రమల్లో కొన్ని నెలల పాటు అప్రెంటిస్‌గా పనిచేయాల్సి ఉంటుంది.

కాలేజీలకు వచ్చి..

జిల్లాలో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఎక్కువ మంది ఐటీఐ విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారు. తక్కువ వయస్సులో ఉపాధి లభించటం ఇందుకు కారణం. జిల్లాలో ఎచ్చెర్ల, శ్రీకాకుళం డీఎల్‌టీసీ, పలాసల్లో మూడు ప్రభుత్వ ఇండ్రస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లు ఉండగా, 20 ప్రైవేట్ ఐటీఐలు ఉన్నాయి. ఏడాదికి మూడు వేల మంది విద్యార్థులు రిలీవ్ అవుతుండగా, 1000 మంది వరకు అప్రెంటిస్ చేస్తున్నారు. పరిశ్రమలే ఐటీఐలకు వచ్చి విద్యార్థులను అప్రెంటిస్ మేళాలు నిర్వహించి ఎంపిక చేసుకుంటున్నాయి.

ఆర్‌టీసీ, ఇండియన్ రైల్వే వంటి ప్రభుత్వ సంస్థలు, జిల్లాలోని అరబిందో, ఆంధ్రా ఆర్గానిక్స్, స్మార్ట్ కెం, నాగార్జునా అగ్రికెం, శ్యాంక్రిగ్ పిస్టన్స్ వంటి సంస్థలతో పాటు, విశాఖపట్నం, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో పరిశ్రమలు సైతం విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్ మేళాలు నిర్వహిస్తున్నాయి. 12 నెలల పాటు అప్రెంటిస్ శిక్షణ ఉంటుంది. విద్యార్థుల క్రమశిక్షణ, నైపుణ్యం, శ్రమించే తత్వం వంటివి నచ్చితే ఉద్యోగ అవకాశాలు సైతం కల్పిస్తున్నారు. అప్రెంటిస్‌లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ అప్రెంటిస్ ప్రమోషన్ స్కీం విద్యార్థికి అందజేసే రూ. 1500తో కలిపి రూ. 7000 నుంచి రూ. 8050 అందజేస్తున్నారు. దీంతో విద్యార్థుల ఖర్చులు ఇతర అవసరాలకు వేతనం లభిస్తుంది. కొన్ని పరిశ్రమలు భోజనం, వసతి సైతం కల్పిస్తున్నాయి. విద్యార్థులు ఐటీఐ పూర్తిచేశాక అప్రెంటిస్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పించాలన్న ప్రభుత్వ ఆదేశాలు మేరకు సైతం అప్రెంటిస్ అనంతరం స్థానికంగా ఉద్యోగాలకు అవకాశం లభిస్తుంది. ప్రధానంగా ఐటీఐ ఫిట్టర్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, వెల్డర్, మోటార్ మెకానిక్ వంటి ట్రేడులు చదివిన విద్యార్థులకు ఈ అవకాశం ఉంది.

పారిశ్రామిక అవసరాలు కీలకం



విద్యార్థులు ఏడాది, రెండేళ్ల ట్రేడులు ఐటీఐ పూర్తి చేస్తున్నారు. ఐటీఐలో విద్యార్థులకు పారిశ్రామిక అవసరాలను అనుగుణంగా శిక్షణ ఉంటుంది. ప్రయోగాలకు ప్రాధాన్యత ఇస్తాం. మరో పక్క ఆన్ జాబ్ వర్క్‌లో భాగంగా పరిశ్రమలకు తీసుకువెళ్తాం. పూర్తిస్థాయి నైపుణ్యం రావాలంటే మాత్రం 12 నెలల అప్రెంటిస్ చేయాలి. అప్పుడే పూర్తిస్థాయి నైపుణ్యాలతో పాటు, భవిష్యత్‌లో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

– **ఎల్.సుధాకరరావు**, జిల్లా కన్వీనర్ పాయింట్ ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్.

కొత్త విషయాలు తెలుసుకుంటున్నాం



క్లాస్‌వర్క్, ప్రయోగాలకు పారిశ్రామిక అవసరాలకు చాలా తేడా ఉంటుంది. పరిశ్రమల్లో టెక్నీషియన్లు, సీనియర్ల పర్యవేక్షణలో అనేక విషయాలు తెలుసుకుంటాం. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో అనేక కొత్త విషయాలు నేర్చుకుంటున్నాను. ఏడాది అప్రెంటిస్ తర్వాత పూర్తి స్థాయిలో పని నేర్చుకునే అవకాశం లభిస్తుంది.

– **ఎల్.గౌరీ శంకర్**, అప్రెంటిస్, స్మార్ట్ కెం టెక్నాలజీస్, పొన్నాడ.

క్షేత్రస్థాయిలో పనినేర్చుకుంటున్నా..



పూర్తిస్థాయిలో పరిశ్రమల్లో పనిచేసే నైపుణ్యం సాధించాలంటే 12 నెలలు శ్రమించాల్సి ఉంటుంది. ప్రతి విషయం నేను తెలుసుకుంటున్నాను. తెలీకపోతే సీనియర్లు చెబుతారు. ప్రారంభంలో కష్టం అనిపించింది. ప్రస్తుతం ప్రతి విషయం తెలుసుకొని ముందుకు సాగుతున్నాను.

– **డి.లోకేష్**, అప్రెంటిస్, స్మార్ట్ కెం టెక్నాలజీస్, పొన్నాడ